నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 | హైదరాబాద్, శుక్రవారం 8 మార్చి 2024 | SIDDIPET

## రామలింగేశ్వరుడు ముస్తాబు

చిలిపిచెడ్, మార్చి 7: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చండూర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 9న శనివారం ఎడ్లబండ్ల ఊరేగింపు, అభిషేకాలు, అన్నదానం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, 10న ఆదివారం ఉదయం పాచిబండ్ల ఊరేగింపు, రాత్రి 7గంటలకు రథోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, 11న సోమవారం రాత్రి 7 గంటలకు లంకా దహనం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ పూజారి మురళీధర్ శర్మ, గ్రామస్తులు తెలిపారు.


గర్భగుడిలో శివలింగం


జాతర కోసం ముస్తాబైన ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయం

# 'బసవేశ్వర'ను బంద్‌పెట్టిన కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

- నారాయణఖేడ్‌కు అభివృద్ధి రుచి చూపింది బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- అబద్ధపు హామీలతో మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- వంద రోజుల బాండ్ పేపర్ వాయిదా ముగిస్తే చీటింగ్ కేసులే
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు అండగా ఉంటాం
- ఎంపీ ఎన్నికల్లో కసితో పనిచేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందాం
- నారాయణఖేడ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు


సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నారాయణఖేడ్, మార్చి 7: నారాయణఖేడ్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.1774 కోట్లతో బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనులను బంద్ పెట్టినందుకు వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీని బొంద పెట్టాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గురువారం నారాయణఖేడ్ పట్టణ సమీపంలోని జుజాల్‌పూర్ శివారులోని హెచ్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీకి గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.40 కోట్ల ఎస్‌డీఎఫ్, టీయూఐడీసీ నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులను రద్దు చేసి కేవలం రూ.10 కోట్లు మంజూరు చేశారన్నారు. తడ్కల్ మండలం ఏర్పాటు కాకుండా అడ్డుకుంటున్నారని, కొత్తగా అధికారం చేపట్టిన వారు గత ప్రభుత్వం కంటే మంచి పనులు చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కానీ, మంజూరైన పనులు నిలిపివేయడం మంచిది కాదని హరీశ్‌రావు హితవు పలికారు.

**బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి...**

నారాయణఖేడ్ నియోజకవర్గానికి అభివృద్ధి రుచి చూపించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది అన్నారు. ఇక్కడి ప్రజలు పదిసార్లు కాంగ్రెస్‌ను గెలిపిస్తే చేయలేని పనులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం పదేండ్లలో చేసిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సబ్‌స్టేషన్లు, మార్కెట్‌యార్డులు, కొత్త చెరువులు, రోడ్లు, డీఎస్పీ, ఆర్డీవో కార్యాలయాలు, కొత్త మున్సిపాలిటీ, తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు ఐదు కొత్త మండలాలను ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ప్రజలకు మంచినీరు దొరకని పరిస్థితి ఉండేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటింటికీ నల్లా ఏర్పాటు చేసి ప్రతి తండాకు, ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేశామన్నారు. ఎనిమిది గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టి ఇంగ్లిష్ మీడియం విద్యనందించినట్లు చెప్పారు. తమ ప్రభుత్వం చేసిన పనుల్లో గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటైనా చేసిందా అని ప్రశ్నించారు.

**హామీలు అమలు చేయకుంటే కేసులే...**

ఆరు గ్యారంటీలు, 13 హామీలతో అధికారం చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రెండు నెలల్లోనే కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు అర్థమైందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కరోనా సమయంలోనూ రైతుబంధును నిరంతరాయంగా అందించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుబంధును నిలిపివేసి రైతులను ఇబ్బంది పెడుతున్నదన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చని కాంగ్రెస్ తీరుపై గ్రామాల్లో చర్చపెట్టి వచ్చే ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు హామీలివ్వడమే కాదు ప్రజలను నమ్మబలికేందుకు వంద రోజుల్లో అమలు చేస్తామని రాసిన బాండ్‌పేపర్లను గ్రామాల్లో పంపిణీ చేశారన్నారు. ఈనెల 15వ తేదీతో వంద రోజులు పూర్తవుతుందని, బాండ్‌పేపర్ రాసిచ్చిన కాంగ్రెస్ నాయకులపై చీటింగ్ కేసులు పెట్టాలన్నారు. బీబీ పాటిల్‌ను బీఆర్‌ఎస్ పార్టీ రెండుసార్లు ఎంపీగా అవకాశం కల్పిస్తే, తల్లిలాంటి పార్టీని మోసం చేసి బీజేపీలో చేరారని, బీబీ పాటిల్‌కు ఎంపీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకుల చేష్టలు చూస్తుంటే ప్రతి కార్యకర్తకూ రక్తం మరిగిపోతున్నదని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. చిటికేస్తే తనతో పాటు బీఆర్‌ఎస్ నేతలంతా కార్యకర్తలకు వెన్నంటి ఉంటామని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు కసితో పనిచేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యకర్తలకు సూచించారు.


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

### ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
**– ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**



అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంతో పాటు జిల్లా అభివృద్ధి కోసం మాజీ మంత్రి హరీశ్‌రావు అహర్నిశలు కృషి చేశారన్నారు. హరీశ్‌రావు సారథ్యంలో ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందే దిశగా కార్యకర్తలు కార్యోన్ముఖులై పనిచేయాలన్నారు.

### కాంగ్రెస్ తెచ్చిన మార్పుతో ప్రజలకు పాట్లు
**– మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



మార్పు రావాలని కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టి అధికారంలో వచ్చారని, తీరా కాంగ్రెస్ తెచ్చిన మార్పుతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. తాము చేసిందే చెప్పడంతో పాటు సాధ్యమయ్యే హామీలిచ్చి ప్రజల ముందుకు వెళ్లినా.. ప్రజలు కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి మోసపోయారన్నారు. బీఆర్‌ఎస్‌దే నైతిక విజయమని, వచ్చే ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలందరూ సోదరాభావంతో కలిసి పనిచేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్‌ఎస్ నేతలు గాలి అనిల్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, భిక్షపతి, మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏడుపాయల జాతర పోదమా..
## నేటి నుంచి మూడు రోజుల పాటు జాతర

- ముస్తాబైన వనదుర్గా భవానీ మాత ఆలయం
- 10 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- జాతరను ప్రారంభించనున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



పాపన్నపేట, మార్చి 7: తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 8 శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఇక్కడ పెద్దఎత్తున జాతర జరుగుతుంది. ఈ జాతరకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తదితర రాష్ర్టాల నుంచి సుమారు 10 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఉత్సవాలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. 8న మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తులు ఉపవాస దీక్షలు చేపడతారు. జాతర రెండో రోజు 9న బండ్లు తిరిగే కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తారు. జాతరలో 100 పైగా బండ్లు తిరుగుతాయి. జాతర చివరి రోజైనా 10న రాత్రి రథోత్సవం వైభవంగా చేపడుతారు. బీదర్, నారాయణఖేడ్, జహీరాబాద్, బొడ్మట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఏడుపాయల కమాన్ మీదుగా జాతరకు వెళ్లాల్సి ఉంటుంది. ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర ప్రైవేట్ వాహనాలపై ఈ రహదారి నుంచి వెళ్లవచ్చు. ఏడుపాయల్లోని చెల్మెలకుంట వద్ద గల చెక్ పోస్ట్ వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. అక్కడే వాహనాలను ఆపి కిలోమీటర్ మేర నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఇక హైదరాబాద్, సికింద్రాబాద్, బాలానగర్, నర్సాపూర్, సంగారెడ్డి, జోగిపేట ప్రాంతాల నుంచి వచ్చేవారు నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు గుండా ఏడుపాయల్లోని రెండో బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో తమ వాహనాలను ఆపి జాతరలోకి వెళ్లాల్సి ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలు వెళ్లడానికి ఏడుపాయల దేవస్థానం 8 మినీ బస్సులు రెండు ప్రాంతాల పార్కింగ్ స్థలాల నుంచి ఏర్పాటు చేసింది. జాతర కోసం మెదక్ ఆర్టీసీ రీజియన్ నుంచి 167 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వీఐపీ క్యూలైన్లు, బారికేడ్లు, జనరల్ క్యూలైన్లు, షవర్లు, దుస్తులు మార్చుకునే గదులు, తాగునీటి కుళాయిలు, సీసీ కెమెరాల ఏర్పాటు, పెద్దఎత్తున పారిశుధ్య కార్మికులు, గజ ఈతగాళ్లు, వైద్యసిబ్బంది దిని అందుబాటులో ఉంచుతున్నారు. సుమారు 1500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరకు సుమారు 12 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామని ఈవో మోహన్ రెడ్డి తెలిపారు. పలుమార్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, అదనపు కలెక్టర్లు అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాలు జరిగాయని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. భక్తుల రద్దీకనుగుణంగా సాధారణ, వీఐపీ క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఆలయ చైర్మన్ బాలాగౌడ్ తెలిపారు. ఏడుపాయల వనదుర్గా భవానీ మాత జాతరను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రారంభించనున్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఏడుపాయలకు చేరుకొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దీంతో ఏడుపాయల వనదుర్గా మాత జాతర ప్రారంభం కానుంది. జాతర కోసం ప్రభుత్వం రూ. 2 కోట్లను విడుదల చేసింది.




ఒగ్గు పూజారుల సమస్యలు నోట్ చేసుకుంటున్న మంత్రి కొండా సురేఖ

## మంత్రికి విజ్ఞప్తి

- ఆరోగ్య భద్రత కల్పించాలి
- మంత్రి కొండా సురేఖకు విన్నవించిన ఒగ్గు పూజారులు

చేర్యాల, మార్చి 7: దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఒగ్గు పూజారులు కలిసి తమ సమస్యలను విన్నించారు. తమకు ఆరోగ్యభద్రత కల్పించాలని, వృత్తిపరమైన కార్యక్రమాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. వాటిని పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలు తెలుసుకున్న మంత్రి కొండా సురేఖ స్పందించి ఆలయ ఈవో బాలాజీతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఒగ్గు పూజారులకు హెల్త్‌కార్డులు అందజేసేందుకు కృషి చేస్తామని, సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఒగ్గు పూజారుల సంఘం అధ్యక్షుడు బొద్దుల కనకయ్య, ఉపాధ్యక్షుడు మక్కపల్లి మల్లేశం, కార్యదర్శి ఎక్కలదేవి రాములు, సహాయ కార్యదర్శి జింకల పర్వతాలు, చంద్రం, ఐలయ్య తదితరులు ఉన్నారు.

## హరీశ్‌రావును సన్మానించిన మాజీ ఎమ్మెల్సీ

సంగారెడ్డి, మార్చి 7: సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావును గురువారం మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు సంగారెడ్డిలోని ఆర్.సత్యనారాయణ నివాసానికి వచ్చారు. ఆయన వెంట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు గాలి అనిల్‌కుమార్, జైపాల్‌రెడ్డి, శివరాజ్‌పాటిల్, చింతా గోపాల్, శ్రీహరి, ఆదర్శ్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యే చింతాప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్‌ను ఆర్.సత్యనారాయణ శాలువాతో సన్మానించారు.


ఎమ్మెల్యే హరీశ్‌రావును సన్మానిస్తున్న సత్యనారాయణ

# నంగునూరు కాంగ్రెస్‌లో తన్నులాట

- భగ్గుమన్న వర్గ విభేదాలు
- ఓ వర్గం నాయకుడిపై దాడిచేసిన మరోవర్గం నాయకులు
- దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు




నంగునూరులో దాడి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నంగునూరు, మార్చి 7: సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. నంగునూరు మండల కాంగ్రెస్ నాయకులు వర్గాలు విడిపోయి ఒకరినొకరు దాడి చేసుకునే స్థాయికి చేరింది. నంగునూరు మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని రాంపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాపోలు రాజా బహదూర్‌రెడ్డికి నామినేటెడ్ పదవి ఖరారైనట్లు ఊహాగానాలు వినిపించాయి. దీంతో మరో కాంగ్రెస్ వర్గానికి చెందిన నాయకులకు అది మింగుడు పడలేదు. దీంతో మంగళవారం ఓపని మీద నంగునూరుకు వచ్చిన రాజాబహదూర్‌రెడ్డి పనిపూర్తి చేసుకుని ఓ స్థానిక నాయకుడి వద్ద కూర్చుని మాట్లాడుతుండగా.. మరో వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అతడిపై దాడి చేసి దుర్భాషలాడారు. ఇన్ని రోజులు ఎక్కడికెళ్లావు.. ఎవరు నువ్వు..అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి తిరిగారు. దీంతో చాలాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇరు వర్గాలకు నచ్చజెప్పిన గ్రామస్తులు అక్కడి నుంచి పంపించారు. దాడికి గురైన కాంగ్రెస్ నాయకుడు రాజాబహదూర్ రెడ్డి రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కాంగ్రెస్ నాయకులు అనరాజు నాగరాజు, చెలికాని యాదగిరి, దేవులపల్లి శ్రీకాంత్, దేవులపల్లి ప్రశాంత్, గోనెపల్లి శివప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కొన్ని రోజులుగా నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి.


బాజా సైండియా-2024 పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## బీవీఆర్‌ఐటీలో బాజా సైండియా-2024

నర్సాపూర్, మార్చి7 : నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌టీ కళాశాలలో జాతీయ స్థాయి విద్యుత్ వాహనాల పోటీలు(బాజా సైండియా-2024) గురువారం రెండో రోజు జరిగాయి. ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె మాట్లాడుతూ.. రెండో రోజు విద్యుత్ వాహనాల పోటీలో ప్రతి వెహికల్‌కి బ్రేక్ పరీక్షలు, సాంకేతిక మూల్యాంకనం, షాక్ అబ్జార్వర్స్ పరీక్షలు, డైనమిక్ సంఘటనలు, ధ్రువీకరణ ఈవెంట్, ఫైనాన్స్, డిజైన్ ఈవెంట్ ఫైనల్స్, ఇన్నోవేషన్స్, ద్రోణాచార్య కార్యక్రమం తదితర జరిగాయని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీ రిలేషన్స్ సతీష్‌చంద్ర, పరుచూరి, మనోనీత్ కుమార్, విష్ణు మోటర్ స్పోర్ట్స్ మేనేజర్ కాంతారావు, డీజీఎం, అన్ని శాఖల విభాగాల అధిపతులు, మేనేజర్లు బాపిరాజు, అశోక్‌రెడ్డి, సురేశ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

# నేడు మల్లన్న పెద్దపట్నం

- కొమురవెల్లికి భారీగా తరలిరానున్న భక్తులు
- ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ
- ఏర్పాట్లు చేసిన ఆలయవర్గాలు



చేర్యాల, మార్చి 7: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన పెద్దపట్నం కార్యక్రమాన్ని ఆలయవర్గాలు శుక్రవారం వైభవంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి చేర్యాల, కొమురవెల్లి, సిద్దిపేట, జనగామ, వరంగల్, కరీంనగర్, గజ్వేల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు వస్తారు. ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఆలయ తోటబావి ప్రాంతంలోని మల్లికార్జున స్వామి కల్యాణ వేదిక ముందు భాగంలో శుక్రవారం అర్ధరాత్రి అనంతరం ఒగ్గు పూజారులు పెద్దపట్నం నిర్వహిస్తారు. 8 వారాల పాటు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆలయవర్గాలు మల్లన్న కల్యాణోత్సవం, పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలను నిష్ఠ, భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. శుక్రవారం రాత్రి భక్తులు మల్లన్న క్షేత్రానికి చేరుకుని పట్నం వేసే కార్యక్రమాన్ని కనులారా వీక్షించి వేకువజామున వెళ్లిపోతారు. భక్తుల సౌకర్యార్థం మల్లన్న కల్యాణ వేదిక వద్ద ప్రత్యేకంగా ఎల్‌ఈడీ స్క్రీన్స్, గ్యాలరీలు ఏర్పాటు చేశారు..

**భక్తిశ్రద్ధలతో...**

ఒగ్గు పూజారులు పట్నం వద్ద జానపద రీతిన పాటలు పాడుతూ స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించే కార్యక్రమమే పెద్దపట్నం. మహా శివరాత్రి పర్వదినం రోజున లింగోద్భవకాలం రాత్రి 12గంటలకు మల్లికార్జున స్వామికి అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు రాజగోపురం, రాతిగీరలు తదితర ప్రాంతాల్లో ఊరేగించి ఆలయంలోకి తీసుకుపోతారు. ప్రత్యేక పూజల అనంతరం రాత్రి 2గంటల సమయంలో ఒగ్గు పూజారులు పంచ రంగులతో పట్నం వేస్తారు. పట్నం తయారు అనంతరం మల్లికార్జున స్వామి ఉత్సవ విగ్రహాలను పట్నం వద్దకు ఆలయ అర్చకులు తీసుకువచ్చి పూజలు నిర్వహించి ప్రదక్షిణలు చేసి గర్భాలయంలోకి తీసుకుపోతారు. భక్తులు పెద్ద పట్నం దాటి స్వామి వారిని దర్శనం చేసుకుని వెళ్లిపోతారు. జనగామ, సిద్దిపేట ఆర్టీసీ డిపోల నుంచి కొమురవెల్లికి ప్రత్యేకంగా బస్సులు నడుపుతారు.


ముస్తాబైన దౌల్తాబాద్ శంభుగుట్ట ఆలయం

## ఉత్సవాలకు ముస్తాబైన శంభులింగేశ్వరాలయం

రాయపోల్, మార్చి 7: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ శంభుగుట్ట దేవాలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. దౌల్తాబాద్‌తో పాటు సిద్దిపేట, మెదక్, నిజామాబాద్, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆది వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఎత్తైన గుట్టపై స్వయంభూ లింగేశ్వరస్వామి వెలిశారు. 8న మహాశివవాత్రి ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజలు, రాత్రి 10 గంటలకు శ్రీపార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. 9న శనివారం ఉదయం 4 గంటలకు అగ్నిగుండాలు, రథోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

